

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఫిబ్రవరి6,ప్రభాత వార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 2884క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 70.048టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి700, పెన్నా డెల్టా 1400, కండలేరు వరద కాలువకు 2000 క్యూసెక్కులు, పెన్నా నదికి2650 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం99.492మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# కార్పొరేషన్ దుబార ఖర్చులను తగ్గించేశాము ఇన్‌చార్జ్ మేయర్, కమిషనర్‌లు



**నెల్లూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పట్టణ ప్రణాళిక విభాగం వారాంతపు సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం నిర్వహిం చారు. ఈ సమావేశంలో నెల్లూరు నగరపాలకసంస్థ ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. నగరపాలక సంస్థకు సంబంధించిన దుబార ఖర్చులను దాదాపు తగ్గించేశామని తెలిపారు. కార్పొరేషన్‌కు ఆదాయం తీసుకువచ్చే ఎల్ఆర్ఎస్, బిపిఎస్ పథకాలపై ప్లానింగ్ కార్యదర్శులు, టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ప్రత్యేక శ్రద్ద వహించాలని సూచించారు. బిపిఎస్, ఎల్ఆర్ఎస్ పథకాల మలు కోసం అందుకొన్న దరఖాసుతలను ఆన్‌లైన్‌లో పరిశీలించి పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మేయర్ సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ బిపిఎస్ పథకంపై అర్హులందరికి అవగాహన కల్పించి తప్పనిసరిగా దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. నక్ష సర్వే ప్రాజెకుటకు అత్యంత ప్రాధాన్యత కేటాయించి ప్రతి ఒక్కరు నిర్దేశించిన గృహాలకు సర్వేను క్రమం తప్పకుండా ప్రతిరోజూ చేపట్టాలని సూ చించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నక్ష ప్రాజెక్టు ద్వారా ప్రజలకు కలిగే ఉపయగాలను వివరించి వారి సంపూర్ణ సహకారాన్ని అందుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీలు వేణు, సతీష్, టిపిబిఓలు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్యామిలీ మెంబర్ సర్వేకు ప్రజలు సహకరించండి: కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ మెంబర్ సర్వేకు ప్రజలందరూ సహకరించి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను అందజేయాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా కరారు. వార్డు సచివాలయ కార్యదర్శుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సర్వే ద్వారా నగర పాలక సంస్థ పరిధిలోని ఒక లక్ష 87వేల కుటుంబాల సామాజిక, ఆర్థిక వివరాలను నమోదు చేయనున్నామని, సర్వే చేయడానికి ఇంటి దగ్గరకు సచివాలయ సిబ్బంది వచ్చినపుడు పూర్తి వివరాలను అందజేసి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## పేదలకు సంజీవనిలా సీఎం రిలీఫ్ ఫండ్




**నెల్లూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త –వైద్యం** పేదలకు సంజీవనిలా సీఎం రిలీఫ్ నిలుస్తోందని, కష్టకాలంలో అండగా నిలుస్తున్న ఆపద్బాంధవుడు సీఎం చంద్రబాబునాయుడు అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని వేదాయపాలెం కార్యాలయంలో శుక్రవారం 38 మందికి మజూరైన రూ.27.14 లక్షలకు సంబంధించిన చెక్కులను సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లిలో ఇప్పటి వరకు 672 మందికి రూ.6.28కోట్ల సాయం అందించినట్లు తెలిపారు. వైసీపీ పాలనలో ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని అన్నారు. నెల్లూరులో ప్రధానమైన అపోలో, కిమ్స్(బొల్లినేని) వంటి ఆసుపత్రులు కూడా ఆ సేవల నుంచి వైదొలిగాయి. ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైన ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబునాయుడు పేదలకు ఎంతో అండగా నిలుస్తున్నారు. వైద్య బిల్లులతో దరఖాస్తు చేసుకున్న వారికి ఉదారంగా సాయం అందిస్తున్నారు. పేదలందరి తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## టీడీపీ, వైసీపీ పార్టీలకు ప్రత్యామ్నాయం లిబరేషన్ పార్టీ



**కావలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** రాష్ట్రం లో టీడీపీ, వైసీపీ పార్టీలకు ప్రత్యామ్నాయంగా వచ్చినదే లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్ తెలిపారు. లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆత్మకూరి రామకోటయ్య ఇతర కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం స్థానిక జమునా కాంప్లెక్స్‌లోని ఎస్ఆర్‌పార్కు నందు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయకుమార్ పాల్గొని మాట్లాడారు. టిడిపి పార్టీ, వైసిపి పార్టీ అరాచకపాలనను అంతమిందించడానికి టిడిపి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత అరాచక పాలనను అంతమందించకుండా అరాచక పాలనను ప్రారంభించడం జరిగిందన్నారు. టిడిపి, వైసిపి పార్టీల పరిపాలనను అతమందించి 2029లోలిబరేషన్‌పార్టీ అధికారంలోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు ప్రసాదం విషయంలో ఇంకా టిడిపి రాద్ధాంతం చేయడం ఏంటని ప్రశ్నించారు. లడ్డు విషయంలో రాజకీయం చేయాలనుకుంటే టిడిపికి సాధ్యం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేశం, ముసలి నవీన్,సాల్మన్‌రాజు, కోవూరు బాబురావు, చేవూరు రత్నవం, నాగార్జున లిబరేషన్ పార్టీ రాష్ట్ర జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## దగదర్తి తహసీల్దార్‌గా లాజరస్



**దగదర్తి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త** దగదర్తి తహసీల్దార్‌గా లాజరస్ శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ పాలకృష్ణపై అక్రమాస్తుల కేసులో ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిన విషయం విధితమే. దీంతో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తహసీల్దార్‌గా లాజర్‌ను నియమించారు. గతంలో నెల్లూరు రూరల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. శుక్ర వారం దగదర్తి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన లాజరస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

## 8న వేల్పులగుంటలో మీ భూమి మీ హక్కు

### - మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటన కార్యక్రమాలు



**నెల్లూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త – వైద్యం** ఏఎస్‌పేట మండలం వేల్పులగుంట గ్రామంలో మీ భూమి– మీ హక్కు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొంటారు. గ్రామంలో 11 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లకు ప్రారంభోత్సవం. మరో రెండు లక్షలతో నూతన సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన 31 లక్షల 60 వేల జేఎల్ఎం నిధులతో నిర్మించనున్న రక్షిత మంచినీటి సరఫరా పథకానికి శంకుస్థాపన. అనంతరం స్థానిక ఎస్సీ కాలనీలో శ్రీవాణి నిధులతో నూతనంగా నిర్మించనున్న శ్రీ వినాయకస్వామి వారి దేవస్థానం కోసం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు.

## సర్వే పాదర్శకంగా చేయాలి : ఎంపిడివో



**కోట,ఫిభ్రవరి 6 ప్రభాతవార్త** మండలంలో జరుగుతున్న యుఎఫ్ఐ సర్వే పారదర్శకంగా ఉండాలని ఎంపిడిఒ దీలిప్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కేశవరంలో జరుగుతున్న సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు.వాట్సప్ గవర్నన్స్ సర్వేలను ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటికి ఇకటి రెండు సార్లు తిరిగి సర్వేను పూర్తి చేయాలని కోరారు.

# ప్రభుత్వ రాజముద్రతో పాస్‌పుస్తకాలు పంపిణి



**కావలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తున్నామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలసి ఎమ్మెల్యే రైతులకు పాసుపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త తరహా పాసుపుస్తకాల్లో క్యూఆర్ కోడ్, భూమి విస్తీర్ణం, లాంగిట్యూడ్, లాటిట్యూడ్ వివరాలు ఎనిమిది దిక్కుల హద్దులు పొదపరచడం ద్వారా భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం ఒకే పత్రంలో లభిస్తుందని తెలిపారు. ఇక బ్యాంకు లోన్ కోసం అధికారులు రైతుల పొలాలకు రావల్సిన అవసరం లేకుండా, క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తేనే భూమి వివరాలన్నీ స్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు. దీంత రుణాల ప్రక్రియ సులభతరం అవుతుందన్నారు.

గత ప్రభుత్వ కాలంలో పాసు పుస్తకాలపై వ్యక్తిగత ఫోటోలు ముద్రించడాన్ని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. 120ఏళ్ళ తరువాత భూములకు రీసర్వే చేపట్టి, పాత రికార్డుల గందరగోళాన్ని తొలగిస్తూ కొత్త హద్దులను ఖరారు చేశామని వివరించారు. రైతుల తమ పాసుపుస్తకాల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే వెంటనే తహశీల్దార్ కార్యాలయం లేదా సచివాలయ ద్వారా ధరఖాస్తు చేసుకుని సవరణ చేయించుకోవాలని సూచించారు. కావలి ఆర్డీఓ సన్నీ వంశీక్రిష్ణ,తహశీల్దార్‌శ్రావన్‌కుమార్, రెవెన్యూ అధి కారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా చూడటం మా బాధ్యత

### - రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలు పంపిణీ

### - ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**ముత్తుకూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త** రైతులకు ఇబ్బంది లేకుండా చూడటం మా బాధ్యతని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ముత్తుకూరు తహశీల్దార్ కార్యాలయంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిచే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు రాజముద్ర, క్యూర్ కోడ్‌తో కూడిన పట్టదారు పాసుపుస్తకాలు అందిస్తున్నామ న్నారు. వైసీపీ హయాంలో రీసర్వే పేరుతో నేరాలు ఘోరాలు జరిగిపోయాయని, మన తాతలు ఇచ్చిన భూములకు సంబంధించిన పాసుపుస్తకాలపై జగన్ రెడ్డి ఫొటోలు వేయించుకున్నారని అన్నారు. రీసర్వేలో జరిగిన భారీ తప్పిదాలను సరిదిద్దడం ప్రస్తుతం అధికారులకు తలకు మించిన భారంగా మారిందన్నారు. ఉదాహరణకు మామిడి పూడిలో 180 ఎకరాల భూమి వాగు పొరంబోకుగా నమోదైందని తెలిపారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, పట్టాదారు పాసుపుస్తకాలు తదితర అన్ని పత్రాలు ఉన్నప్పటికి రైతులు హక్కులు కోల్పోయిన దుస్థితి అని అన్నారు. పొదలకూరు మండలంలో అయితే ఊళ్లకు ఊళ్లను 22ఏలో పెట్టి రైతులను సమస్యల్లోకి నెట్టారని అన్నారు. పార్లపల్లి, మర్రిపల్లి, మహ్మదాపురం, వెలికంటిపాళెం గ్రామాల్లో వందల ఎకరాలను 22ఏ, గయాళుగా పెట్టేశారు. ప్రస్తుతం రెండు గ్రామాల్లో సమస్యలను పరిష్కరించగా, మిగిలిన గ్రామాల సమస్యల పరిష్కారం ప్రాసెసింగ్ లో ఉందన్నారు. ఏ ఊరికి వెళ్లినా, కార్యాలయంలో కూర్చున్నా భూ సమస్యలపైనే అర్జీలు వస్తున్నాయన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో రెవెన్యూ అధికారులకు అధికారం లేకుండా రిటైర్డ్ అధికారుల చేతిలో భూముల పెత్తనం పెట్టారు. రైతుల పాలిట ప్రమాదభరితంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కూటమి ప్రభుత్వం రాగానే రద్దు చేసిందని, పట్టాదారు పాసు పుస్తకాలపైనా రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించి రాజముద్రతో అందిస్తున్నామన్నారు. ముత్తుకూరు మండలంలో 5480 మంది రైతులకు గాను ఇప్పటి వరకు 2370 మందికి అందించారు. గతంలో చోటుచేసుకున్న పొరపాట్లను సరిదిద్దిన తర్వాతే రైతులకు అందిస్తున్నారు. రైతులు తమ భూములపై హక్కులు పొందే విషయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడటం మా బాధ్యత అన్నారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ ఆధ్వర్యంలో ప్రజాధర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రతి సమస్యను నిర్దేశిత కాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఈదురు రామ్మోహన్ రెడ్డి, మునుకూరు రవి కుమార్ రెడ్డి, కృష్ణపట్నం సొసైటీ అధ్యక్షులు పలం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు రాగల శివకృష్ణ, పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు, అక్కయ్య గారు ఏడుకొండలు, శంకర్, సర్వేపల్లి ఐటిటిపి నాయకులు తిరుమల శెట్టి సతీష్ నాయుడు, నన్నం దీనయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 236 కోట్లతో త్రాగునీరు-డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం అతి త్వరలో అభివృద్ధి జాతర

**నెల్లూరు రూరల్ ఫిబ్రవరి 6, ప్రభాతవార్త** నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా 236 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసినట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. నేడు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నిధులతో నియోజకవర్గంలోని ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న త్రాగునీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించబోతోందని స్పష్టం చేశారు.ఈ 236 కోట్ల రూపాయల నిధులతో నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని విలీన గ్రామాల్లో సుమారు 200 కిలోమీటర్ల మేర త్రాగునీటి పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే 41వ డివిజన్ పరమేశ్వరి నగర్, 30వ డివిజన్‌లోని అతి పెద్ద కాలనీ వై.యస్.ఆర్.నగర్, 31వ డివిజన్ అక్కచెరువుపాడు, అంబాపురం ప్రాంతాల్లో ఆధునిక వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం జరగనున్నదని పేర్కొన్నారు. ఈ త్రాగునీటి పనులకే 125 కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని చెప్పారు.అదేవిధంగా మరో 111 కోట్ల రూపాయలతో 18, 19, 20, 30, 35, 41 డివిజన్‌లలో మొత్తం 51 కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ పనులు పూర్తయితే వర్షాకాలం లోనూ, వేసవిలోనూ డ్రైనేజీ సమస్యలు లేకుండా ప్రజలు సౌకర్యవంతమైన జీవనం గడుపుతారని ఆయన స్పష్టం చేశారు.గత వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఈ పనుల కోసం ఎన్నిసార్లు అప్పటి ముఖ్యమంత్రిని కోరినా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని, తన గొంతు అరిగిపోయినా నిధులు రాలేదని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ గారు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ భారీ నిధులు విడుదల చేయించారని, ఇందుకు వారిద్దరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.అతి త్వరలో ప్రజల సమక్షంలో 236 కోట్ల రూపా యలతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు, అది ఒక అభివృద్ధి జాతరను తలపించేలా జరగనుందని ఆయన అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి అడుగులో సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి, యువనేత నారా లోకేష్‌కి, జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ , ఆనం రామనారాయణ రెడ్డి , జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఫరూక్ , పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , ఎమ్మెల్సీ బీదరవిచంద్ర,నగర ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ , జిల్లా



కలెక్టర్, కమిషనర్‌తో పాటు అధికార యంత్రాంగానికి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలు ఋణపడి ఉంటారని తెలిపారు.రాబోయే రోజుల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులుచేపట్టి,రాష్ట్రంలోనే ఆదర్శ నియోజ కవర్గంగా నిలబెడతానని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హామీ ఇచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే



**గూడూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త** ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమం ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకి తెలియజేశారు. అనంతరం రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పనిచేయని శాఖలపై అసెంబ్లీలో ప్రస్తావించి ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. రెవిన్యూ, హోసింగ్ అధికారులు పనితీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం రాష్ట్రం ప్రభుత్వం గ్రామాల నుండి ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథం వాహనాలను ఏర్పాటు చేసిందని, అందులో భాగంగా గూడూరు, చిట్టమూరు మండలాల స్వచ్ఛ రథం వాహనాలను ఎంపిడిఓ కార్యాలయం నందు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఎంపీడీవో మధుసూదన్ రావు, గూడూరు మండల అధ్యక్షులు వెంకటేశ్వరరాజు, తిరుపతి పార్లమెంట్ జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, నెల బల్లి భాస్కర్ రెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, బిల్లు చెంచు రామయ్య, అట్రాసిటీ సభ్యులు రావూరు సురేంద్ర, ఏసుపాక పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు. అర్హులైన పేదలకు నివేశ స్థలాలను మంజూరు చేయాలని సీపీఐ నియోజవర్గ కార్యదర్శి జి.శశి కుమార్ , ఏ. ఐ.టి. యు.సి నియోజవర్గ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని నియోజకవర్గ విజనరీ యాక్షన్ ప్లాన్ నందు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు అర్హులైన పేదవారికి నివేశా స్థలాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కి వినతి పత్రం అందచేశారు. ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సానుకూలంగా స్పందించి అర్హులైన వారికి వెంటనే నివేశ స్థలాలు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, ఏ. ఐ.టి. యు.సి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ గతంలో పేదల కొరకు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నివేశ స్థలాలు మంజూరు చేయాలని అధికారులకు వినతి పత్రాలు అందచేశామన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పేదలకు నివేశ స్థలాలు మంజూరు చేయాలని కోరారు.



## చెవి,ముక్కు,గొంతు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి



**కావలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం, సర్వాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం తోట వెంకటేశ్వర్లు ఆధ్వర్య ంలో శుక్రవారం విద్యార్థులకు చెవి,ముక్కు ,గొంతు ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహిం చడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ ఈఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ సి.విజయభాస్కరావు హాజరై విద్యార్థులను పరీక్షించి మాట్లాడారు. విద్యార్థులకు చిన్నవయసులోనే అనేక ఆరోగ్యసమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా చెవి, ముక్కు,గొంతులకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. ఇయర్‌పోన్స్ వాడకం, చెవిలో పిన్నులు, అగ్గిపుల్లలు, పెన్సిల్లు వాడడం వల్ల వినికిడి శక్తి తగ్గుతుందని, ముక్కు మరియు గొంతు విషయమై జలుబు, అలర్జీలను నిర్లక్ష్యం చేయరాదని, ఇన్‌ఫెక్షన్స్ రాకుండా గోరువెచ్చని నీరు తాగడం మంచిదని తెలిపారు. ఈ సందర్భంగా తోట వెంకటేశ్వర్లు డాక్టర్ విజయభాస్కర్‌కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎయిడెడ్ పాఠశాలలను తనిఖీలు నిర్వహించిన ఎంఈఓ



**కావలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** స్థానిక డాక్టర్ లక్ష్మీక్రిష్ణారావు విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల మరియు విశ్వోదయ బాలుకోన్నత పాఠశాలలలో శుక్రవారం కావలి రూరల్ మండల విద్యాశాఖ అధికారి బండి గోవిం దయ్య పాల్గొని పాఠశాలలో యూడైస్ వివరములకు విద్యా ర్థుల వాస్తవ సంఖ్యకు సరిచూసి, పాఠశాలలకు విచ్చేసిన విద్యార్థుల సంఖ్యను లెక్కించి దీర్ఘకాలికంగా పాఠశాలలకు రాని విద్యార్థుల పేర్లను పాఠశాలలో లేనట్లుగా గుర్తించి సంతృప్తిని వ్యక్తం చేశారు. వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల్లో వస్తున్న మార్కుల తీరును పరిశీలించి విద్యార్థులు అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిం చాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాలల ప్రదానోపాద్యాయులు ద్వారకనాథ్‌చౌదరి, లక్ష్మీ మాదవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆస్తి తగాదాతో రైల్వే ఉద్యోగి దారుణ హత్య

**కావలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** ఆస్తి తగాదా, కుటుంబ కలహాలతో రైల్వే గేట్‌మాన్ దారుణ హత్య కు గురైన సంఘటన కావలి రూరల్ మండలం, రుద్ర కోట ఎస్సీ కాలనీలో జరిగింది. కావలి రూరల్ పోలీ సుల సమాచారం మేరకు రుద్రకోట గ్రామానికి చెందిన ఆరే చినకొండయ్య రైల్వేలో గెట్‌మెన్‌గా పనిచేస్తూ విఆర్ఎస్ ఇచ్చి ఉద్యోగమును చిన్న కొండయ్య మొదటి భార్య రెండో కుమారుడైన నాగరాజుకు(47) ఇచ్చిన టుల తెలిపారు. ప్రస్తుతం నాగరాజు కావలి



టౌన్‌లోని పెంకుల ప్యాక్టరీ వద్ద రైల్వేగేట్ నందు ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. నాగరాజుకు సుమారు 28సంవత్సరాల క్రితం మృతుడి మేనత్త కుమార్తె మాధవితో వివాహమైనట్లు తెలిపారు. వీరికి ముగ్గురు కుమారులు సంతానమైనట్లు తెలిపారు. వీరిద్దరికి మనస్పర్ధలు కారణంగా 10సంవత్సరాల కిందట ముగ్గురు కుమారులని తీసుకొని చిన్నగంజాంలో ఉన్న తల్లిదండ్రుల వద్ద ఉంటున్నట్లు తెలిపారు. నాగరాజు రుద్రకోట ఎస్‌సికాలనీలో నివాసం ఉంటూ విధులు నిర్వహిస్తుండేవాడని తెలిపారు. నాగరాజు ఉంటున్న ఇల్లుని మృతుని అత్త అంకమ్మ స్థలం కొని ఇట్లు కట్టించినట్లు తెలిపారు. ఇంటిని నాగరాజు తన పేరు మీద మార్చుకునేందుకు ప్రయత్నిస్తుండగా ఆ విషయం గురించి నాగరాజుకి ఆయన అత్త, భార్య కుమారులకు గొడవ ఉన్నట్లు తెలిపారు. రెండు రోజుల కిందట మృతుడు రెండవ కుమారుడైన నవీన్ వచ్చి ఉండి గురువారం రాత్రి ఎప్పుడో ఇంటి నుంచి వెళ్లినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 7గంటల సమయంలో మృతుడు పిన్నమ్మ శేషమ్మ వచ్చి చూడగా మృతుడు శరీరంపై బలమైన గాయాలు తగిలి చనిపోయి ఉన్నట్లు విషయంను భర్త అంజమ్మకు మృతుని తండ్రి ఆరే చిన్నకొండయ్యకు ఫోన్ ద్వారా తెలియజేడయం జరిగిందన్నారు. మృతుడు తండ్రి అతని మూడో భార్య అయిన శాంబవి ఇతని కుమారుడైన సాయిఈశ్వర్ వచ్చి చూసి మృతుని మరణంపై ఆనుమానం ఉన్నటుల కావలి రూరల్ పోలీసేటషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సంఘటన ప్రదేశాన్ని కావలి రూరల్ పోలీసులు, డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం పరిశీలించడం జరిగింది. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గిరిజన కాలనీలోని పేదలకు అన్నదానం



**కావలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** కావలి, మసునూరు నివాసులు మతమంచి లక్ష్మీ భర్త స్వర్గీయ మదమంచి సత్య నారాయణ చౌదరి మూడవ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వ ర్యంలో కావలి పట్టణం పెంకుల ప్యాక్టరీ చెరువుకట్ట గిరిజన కాలనీలోని పేదలకు అన్నదానం చేయడం జరిగింది. ఈ సంద ర్భంగా సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర మాట్లా డుతూ తమ యొక్క సంస్థ ద్వారా చదువుకుంటున్న పేదలకు అన్నదానం చేయించిన దాత మదమంచి లక్ష్మీకి ధన్యావాదాలు తెలిపారు. అలాగే స్వర్గీయ మదమంచి సత్యనారాయణ చౌదరి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్ క్యాటరింగ్ నిర్వాహకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

**కోవూరు ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పోతిరెడ్డిపాలెం గ్రామం సాలు చింతలకు చెందిన అన్నవరపు బాల కోటేశ్వరమ్మ శుక్రవారం మధ్యాహ్నం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమా చారం. చిన్నపాటి భార్యాభర్తల మధ్య తలె త్తిన తగాదాలే ఈ ఘటనకు కారణమై ఉండ వచ్చని స్థానికులు చెబుతున్నారు. ఘటనపై సమా చారం అందుకున్న పోలీ సులు అక్కడికి చేరు కుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపడతామని పోలీ సులు తెలిపారు.



## మొక్కలు ఎలా సాగు చేయాలి అనే విధానంపై ఉపాధ్యాయులు అవగాహన



**ఉదయగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉదయగిరి ఆవరణలో శుక్రవారం ఉన్నటువంటి పీఎం కిచెన్ గార్డెన్‌లో వ్యవసాయ మొక్కలను ముఖ్యంగా కూరగాయలు ఎలా పండించాలి అనేటువంటి దాన్ని విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాసరావు సమక్షంలో బయాలజీ టీచర్ ఒరుగుంట నారాయణ బయాలజీ టీచర్, వివిధ రకాలైనటువంటి కూరగాయ మొక్కలను ఎలా సాగు చేయాలి అనేటువంటిది పిల్లలకు అవగాహన కల్పిస్తూ ప్రాచీన పద్ధతులను, ఆధునిక పద్ధతులను గురించి వివరిస్తూ నేల రకాలు పంటల రకాలు అదేవిధంగా మిక్స్‌డ్ క్రాప్స్ పంట మార్పిడి పద్ధతులు అందులో ఉపయోగిస్తున్నటువంటి పెస్టిసైడ్స్ ఇన్సెక్టిసైడ్స్ లాంటి పద్ధతులన్నింటిని కూడా వివరిస్తూ ప్రాక్టికల్‌గా చేయించడం అనేటువంటి జరిగింది. ప్రస్తుతం ఇక్కడ చుక్కాకు, చిర్రాకు, పాలకూర, గోంగూర, తోటకూర లాంటి ఆకుకూరలు అదే విధంగా బెండకాయలు, గోరు చిక్కుళ్ళు, చిక్కుళ్ళు, సొర, బీర, కాకర, కాయలు లాంటి కూరగాయ మొక్కలను ఎలా పండించాలి అనేటువంటిది పిల్లలకు ప్రాక్టికల్‌గా వివరిస్తూ నేర్పించడం అనేటువంటి జరుగుతుంది అదే విధంగా రియల్ లైఫ్‌లో ఒక వ్యవసాయదారుడు పంటను సాగు చేయడానికి అవలంభించేటువంటి పద్ధతులన్నీ కూడా ప్రాక్టికల్‌గా పిల్లలు నేర్చుకోవడానికి ఈ పీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్నటువంటి కిచెన్ గార్డెన్‌లో చాలా చక్కగా పండించి మంచి దిగుబడిని పాఠశాలలో ఉన్నటువంటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునీలు అందరూ కూడా అందరి సహకారంతో దీన్ని అభివృద్ధి చేస్తున్నారు.

## విద్యాంజలి కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులతో సమావేశం

**ఉదయగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు విద్యాంజలి కార్యక్రమంపై ప్రాథమిక, ప్రాధమికోన్నత జిల్లా ఉన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఏపీఆర్ఎస్ గండిపాలెం ప్రధానోపాధ్యాయుల అందరికి శనివారం 7వ తేదీన ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఉదయగిరిలోనే స్థానిక స్త్రీ శక్తి భవన్ నందు సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి టి.శ్రీనివాసులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొను ప్రధానోపాధ్యాయులందరికి పెన్, నోట్ బుక్ ఉదయం మధ్యాహ్నం టీ, స్నాక్స్, మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు కలవని తెలియజేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టిన తర్వాత విద్యార్థులను ఇంటికి పంపి సమావేశానికి హాజరు కావాలని తెలియజేశారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందరూ ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఎవరికి ఎటువంటి మినహాయింపు లేదని తెలియజేశారు.



## మాంసాహార మార్కెట్ ఏర్పాటు చేయండి

ఉదయగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త నియోజకవర్గ కేంద్రం అయిన ఉదయగిరిలో మాంసాహార మార్కెట్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ సజీల్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. చేపలు, మాంసం, కోడి మాంసం రోడ్డుపై విక్రయించడం సరి కాదని, అందుకోసం ప్రత్యేక స్థలం ఉండాలని బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయించడం చట్టపరంగా నేరం అవుతుందని ఆయన అన్నారు. అదే విధంగా కూరగాయలు కూడా మార్కెట్‌లోనే విక్రయించే పద్ధతి పాటిస్తే పంచాయతీకి ఆదాయం కూడా ఉంటుందని ఆయన సూచించారు.



## నెల్లూరులో మహిళ దారుణ హత్య

**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** నగరంలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు రూరల్ మండలం అల్లిపురంకు చెందిన జయలక్ష్మి(35), జగన్ దంపతులు. వారికి ఒక కుమార్తె ఉంది. భార్యాభర్తల నడుమ మనస్పర్ధలు ఏర్పడడంతో ఇద్దరు విడిపోయి విడివిడిగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో జయలక్ష్మికి అల్లుడు వరసైన కుమార్‌తో సన్నిహితం ఏర్పడింది. ఇద్దరూ కలిసి స్థానిక ఆర్ఎస్ఆర్ హై స్కూల్ సమీపంలో ఓ ఇంటిని అద్దెకి తీసుకొని సహజీవనం చేస్తున్నారు. కొద్దిరోజుల కిందట కుమార్ తల్లి మరణించారు. ఆమె అంత్యక్రియలకు కుమార్ వెళ్లేందుకు ప్రయత్నించగా జయలక్ష్మి అడ్డుకున్నారు. అప్పటినుండి ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంటూ వస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన కుమార్ జయలక్ష్మితో మరోసారి గొడవపడ్డాడు. ఆవేశంతో ఆమెను హత్య చేశాడు. సంఘటన వివరాలను అందుకున్న నగర ఏఎస్పీ దీక్ష, నవాబుపేట సీఐ వేణుగోపాల్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

## కార్మిక చట్టాలపై దుకాణదారులకు అవగాహన




**కోవూరు,ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని కార్మిక శాఖ ఆధ్వర్యంలో బాల కార్మికుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏఎల్‌వో అనిల్‌కుమార్ కోవూరు మండలంలోని పీఆర్ఆర్ కాలనీ సెంటర్‌లో ఉన్న సాయిబాబా వాటర్ ప్లాంట్ దుకాణ యాజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారిని మీ దుకాణాల్లో పనికి నియమించుకోవాలని వారికి తెలిపారు. ప్రతి ఒక్కరికి దుకాణ కార్మిక శాఖ గుర్తింపు పత్రం కొరకు దరఖాస్తు చేసుకోగలరని , అలాగే కార్మిక భీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎల్‌వో వెంకటేశ్వర్లు, ఏహెచ్‌టీయూ ఏఎస్ఐ సతీష్, కానిస్టేబుల్ టీవీఎస్ రాంబాబు, శంకరయ్య, మున్వర్, సుమ, శైలజ పాల్గొన్నారు.

## ఆత్మకూరులో స్పర్శలెప్రసీ అవగాహనా సదస్సు




**ఆత్మకూరు , ఫిబ్రవరి6,ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని మహాత్మజ్యోతిరావుపూలే బిసి బాలికల రెసిడెన్షియల్ స్కూల్, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో శుక్రవారం డాక్టర్ అస్మా ఆధ్వర్యంలో స్పర్శ అవగాహనా సదస్సు ను నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టువ్యాధి ఉన్న వారి పట్ల వివక్ష లేకుండా చూడాలని , కుష్టువ్యాధి అంటువ్యాధి కాదని మందులతో నయం చేయవచ్చన్నారు. కుష్టువ్యాధి ఉన్నవారి పట్ల వివక్ష చూపరాదన్నారు. ఫిబ్రవరి 17న డీ వార్మింగ్ డేను నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులతో వారి ఆరోగ్యాల గురించి తెలుసుకున్నారు. ఆహారం నాణ్యత, భోజన విధానం గురించి వివరాలు సేకరించారు. వంటగది, డైనింగ్‌హాల్, బాత్‌రూములను పరిశీలించారు.పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థినిలకు ఎవరికైనా జ్వరం వచ్చినా ఇతర ఆరోగ్యసమస్యలేమైనా ఉంటే వెంటనే సమాచారం అందించాలని పాఠశాల ప్రిన్స్‌పాల్‌కు సూచించారు. ఈకార్యక్రమంలో హెచ్ఓ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ జి.రవీందర్‌రెడ్డి, ఆశకార్యకర్తలు, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవి పూజ



మర్రిపాడు , ఫిబ్రవరి6,ప్రభాతవార్త: మండల కేంద్రమైన మర్రిపాడులోని కస్తూరీభాగాంధీ విద్యాలయంలో శుక్రవారం చదువుల తల్లి సరస్వతీదేవి పూజను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చదువులో మంచి ప్రతిభ కనపరచి విద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ప్రిన్స్‌పాల్ లక్ష్మీదేవి తెలిపారు. రాబోయే పబ్లిక్ పరిక్షల్లో విద్యార్థినిలు ఉత్తమ ప్రతిభకనపరచాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో విద్యాలయ ఉపాధ్యాయినిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దాతల ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలి




కోట,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త గ్రామాల్లోని దాతల సహాయంతో పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎం.మస్తానయ్య కోరారు. శుక్రవారం స్థానిక ఎవికేఆర్ జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో విద్యాంజిలి 2.0 కార్యక్రమంపై ఆయన మాట్లాడారు.పాఠశాలల ద్వారా నిధులు సమకూర్చుకోవాడానికి విద్యాంజిలి వెబ్ సైట్ బాగ ఉపయోగపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం.కరుణాకర్ రెడ్డి,రిస్సోర్‌పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు. పాల్గన్నారు.

## కె.వి ట్రాన్స్ఫార్మర్ ప్రారంభోత్సవం



బిట్రగుంట ఫిబ్రవరి 6, ప్రభాతవార్త : బోగోలు మేజర్ పంచాయతీలోని దళితవాడలో శుక్రవారం నూతనంగా ఏర్పాటుచేసిన 100 కె.వి ట్రాన్స్ఫార్మర్ ప్రారంభించినట్లు ట్రాన్స్కో ఏఈ జడ రాయ తెలిపారు. కావలి శాసనసభ్యులు డివి కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో లో వోల్టేజ్ని నివారించేందుకు దీనిని కొత్తగా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో నాగులవరం సొసైటీ అధ్యక్షుడు, బోగోలు టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ చిలకపాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు

# పురుషుల సింగిల్స్, డబుల్స్ విభాగంలో టోర్నమెంట్

**గూడూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** జనవరి 31 నుండి ఫిబ్రవరి 06 వరకు పురుషుల సింగిల్స్, పురుషుల డబుల్స్ విభాగాలలో అరెనా 5 – ఏఐటిఏ పురుషుల టోర్నమెంట్‌ను నిర్వహించింది. మన గూడూరు నందు ఇలాంటి సౌకర్యాలతో టెన్నిస్ టౌర్నమెంటును నిర్వహించటం మాకు ఎంతో సంతోషాన్ని కలుగచేసింది. అధునాతనమైన క్లే కోర్టులు, స్విమ్మింగ్ పూల్ , రూమ్ భోజన వసతులు వంటి సౌకర్యాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న ఆటగాళ్ల నుండి మాకు చాలా మంచి స్పందన వచ్చింది. క్రీడా కార్యక్రమంలో దాదాపు 80+ మంది ఆటగాళ్ళు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు కూడా మన గూడూరులో ఇలాంటి వసతి ఉండటం చాల మంచి పరిణామం అని భవిష్యత్తులో ఇలాంటి ఇంకా ఎన్నో టౌర్నమెంటులు నిర్వహించాలని కోరుకున్నారు. బాగా నిర్వహించబడుతున్న టెన్నిస్ కోర్టులు, ఫిజియోథెరపిస్ట్, కిట్ రిపేర్‌మెన్ డాక్టర్ సౌకర్యాలు టోర్నమెంట్‌లో అందుబాటులో ఉంచారు. మా టైటిల్ స్పాన్సర్ ఐ అండ్ వి బయో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఉదారమైన మద్దతు లేకుండా ఈ టోర్నమెంట్ సాధ్యం కాదు. 1980లలో స్థాపించబడిన ఈ కంపెనీ భారతదేశం అంతటా, ముఖ్యంగా ఆక్వాకల్చర్ ఉన్న అన్ని ప్రాంతాలలో మంచి గౌరవనీయమైన పేరుగా ఎదిగింది. ఆవిష్కరణ, స్థిరత్వం, సమాజ అభివృద్ధి పట్ల వారి నిబద్ధత సంవత్సరాలుగా బలమైన జాతీయ ఉనికిని నిర్మించడంలో వారికి సహాయపడింది. ఈ టోర్నమెంట్ ప్రారంభం కావడానికి ముందే, జి.కె. కృష్ణారెడ్డి వ్యక్తిగతంగా టెన్నిస్ మరియు భవిష్యత్తులో ఇలాంటి క్రీడా కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు, ఇది క్రీడలు, యువ అథ్లెట్లను ప్రోత్సహించడం పట్ల ఆయనకున్న మక్కువను నిజంగా ప్రతిబింబిస్తుంది. ఆయన ఈరోజు మాతో చేరలేకపోయినప్పటికీ, ఆయన ప్రతినిధి రామ్మూర్తి ఇక్కడ మాతో ఉన్నారని పేర్కొన్నారు.



## పిఆర్‌పి కోసం పోస్టుకార్డుల ఉద్యమం

**కోట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పిఆర్‌సితో విడదీయరాని అనుబంధం ఉంటుంది. ఐదేళ్లకోసారి జీతభత్యాలు పెరుగుతాయని, కుటుంబ ఆర్థిక సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని కొండంత ఆశతో ఉంటారు. గత ప్రభుత్వం రివర్స్ పేరిట 11వ పిఆర్‌సి అమలు చేసి



కోలుకోలేని దెబ్బతీసింది. ప్రస్తుతం రెండవ పిఆర్‌సి కోసం వేతన జీవులు ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం పిఆర్‌సి కోసం పోస్టుకార్డుల ఉద్యమానికి శ్రీకారంచుట్టినట్లు మండల యుటిఎఫ్ అధ్యక్షులు మువ్వల మనోహర్ తెలిపారు. నాలుగువేల మందితో పోస్టుకార్డులు రాయించి ముఖ్యమంత్రికి నేరుగా పంపాలని ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అందుకోసం ప్రతి మండలంలో పోస్టుకార్డుల ఉద్యమం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం చేసిన దగాను వివరిస్తూ, ప్రస్తుత కూటమి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ కార్డులు రాసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. తద్వారా కదలిక వస్తుందని నమ్ముతున్నామని చెప్పారు. పిఆర్‌సి కమిషన్‌కు ఛైర్మన్‌ను నియమించాలన్నది తొలి డిమాండ్. 29 శాతం ఐఆర్ ప్రకటించి నాలుగు పెండింగ్ డిఎలను ప్రకటించాలని కోరారు. సిపిఎస్ రద్దు చేసి ఉద్యోగులకు మలిదశలో ఆసరా కల్పించాలని కార్డుల్లో వివరిస్తామని చెప్పారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు దారితీసి రాష్ట్రప్రభుత్వం న్యాయం చేస్తుందన్న నమ్మకంతో కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.

## ఉపాధి కూలీలపై మోడీ ప్రభుత్వం దాడి

**కావలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** ఉపాధి కూలీలపై మోడీ ప్రభుత్వం దాడిచేసి ఉపాధి కూలీలకు నష్టం చేసే విబిజిరామ్‌జి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని సిపిఐ కావలి నియోజకవర్గం సహాయ కార్యదర్శి దమ్ము దర్గాబాబు తెలిపారు. కావలి మండలం చల్లంచర్ల గ్రామంల సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాది హామీ కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా దర్గాబాబు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన



తరువాత కేంద్ర బడ్జెట్‌లో ప్రతి ఏడాది ఉపాధి హామీ నిధులు కేటాయింపులు తగ్గిస్తూ వస్తుందని మన రాష్ట్రంలో దాదాపు 15నుంచి 18లక్షలలోపు జాబ్‌కారుడలు తొలగించారని తెలిపారు. ఉపాధి హామి చట్టం వల్ల పేదల జీవితాలు మెరుగుపడ్డాయని వ్యవసాయ సీజన్ పేరుతో ఉపాధి హామీ పనులు నిలిపివేయడం జరిగిందన్నారు. వందరోజులు పని కల్పించలేకపోయిన కేంద్ర ప్రభుత్వం 125రోజులు పని దినాలను కల్పిస్తామని చెప్పడం బూటకమని తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గాంధీ పేరును తొలగించి ఆయనను ఆగౌరపరిచారని రాంజీ కొత్త చటాటన్ని తీసుకువచ్చారని ఈ చట్టాన్ని రద్దుచేసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్దరించాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు మనోజ్, ముప్వ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## దారి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

**కోట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** కోట మండలం గూడలి పంచాయతీలోని ప్రకాశం కాలనీలో ఉన్న ఎనీ ఆర్ కాలనీలో ప్రభుత్వ భూముల్లో కొందరు గిరి జను లు నివాసం ఉంటున్నారు. అక్కడే ఉంటున్న బోరింగ్ రమణారెడ్డి కుమార్తెలు రోడ్డును అడ్డగి ంచా రని జడ్పి టిసి సభ్యులు కోటయ్య ఆరోపి ంచారు. శుక్ర వారం ఎంపిపి వేమిరెడ్డి సౌజన్యారెడ్డికి, డిప్యూటీ తహశీల్దా ర్ మల్లికార్జునరావుకు ఫిర్యాదు చేశారు. రహదా రిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



## పిసిసి అధ్యక్షురాలు షర్మిల పర్యటన విజయవంతం చేయండి

**కోట, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** పిసిసి అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఈ నెల 12న నెల్లూరు జిల్లా మనుబోలు మండలం అక్కంపేట గ్రామానికి విచ్చేస్తున్నారని గూడూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రామకృష్ణారావు తెలిపారు. ఆయన శుక్రవారం 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమా ండ్ చేశారు. గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించేందుకు 2005లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. అయితే మోడీ ప్రభుత్వం దీన్ని రద్దు చేసి ఇబిజి రాంజీ పేరుతో కొత్త పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ కొత్త పథకం రాష్ట్రాలకు భారం, కార్పొరేట్‌కు లాభమని పేర్కొన్నారు. వెంటనే దీన్ని రద్దు చేసి పాత పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలంటూ పిసిసి అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఈ నెల 12న అక్కంపేటకు వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని రామకృష్ణారావు కోరారు.

## ఎమ్మెల్యే సహకారంతో 4 స్మశాన వాటికలు చదును

**కొడవలూరు ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని 2 ఎస్.సి,1 బిసి,1 మైనారిటీ కాలనీలా ప్రజలకు సంబంధించి స్మశాన వాటిక ముళ్ల చెట్లతో నిండి కర్మకాండకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమ స్యను స్థానిక ప్రజలు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన



ఎమ్మెల్యేజెసిబి యంత్రాన్ని ఏర్పాటు చేశారు. కొడవ లూరు గ్రామ యువ నాయకులు 4 స్మశాన వాటికల్లో ముళ్ల చెట్లను తొలగించి చదును చేసి మెరుగు పరిచారు. గ్రామ ప్రజలు .ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండాలంపాలెం సొసైటీ డైరెక్టర్ పి.శ్రీనివాసులు బూత్ కన్వీనర్ దుంపల బాబు, నీటి సంఘం అధ్యక్షులు నక్క రమణయ్య,టీడీపీ సోషల్ మీడియా కన్వీనర్ కోవూరు వెంకీ,వార్డ్ మెంబర్ నక్క రాజేంద్ర, బాబు,దినేష్, మురళి ,సుబ్బు, గంగపట్నం శ్రీనివాసులు, ఊయ్యాలనారాయణ, ప్రవీణ్ పాల్గున్నారు.

## రైతు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి : చంద్రశేఖర్

**విడవలూరు,ఫిబ్రవరి 6ప్రభాతవార్త:** మండల కేంద్ర పరిధి గ్రామ రైతుల పట్టాదారు పాసు పుస్తకాలు నమూనా పక్రియను వేగవంతం చేయాలని వీఆర్వోలకు తహశీల్దార్ కె. చంద్రశేఖర్ ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రాజ ముద్ర పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని ఆదే శాలలో భాగంగా విడవలూరు గ్రామ రైతులకు త్వరలోనే పాస్ పుస్తకాలు ముద్రించి అందచేయాలి, గ్రామ రెవెన్యూ



అధికారులు రైతుల వద్ద పూర్తి వివరాలు సేకరించి తప్పి దాలను సరిచేసి ఒక నమూనా ఏర్పాటు తదుపరి రైతులకు తెలియపరచి ఆన్లైన్ వేలిముద్ర నమోదు చేయా లని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ అబ్దుల్ సలాం, వీఆర్వోలు దుర్గాప్రసాద్ , నిఖిల్, కుమార్, లక్షి ్మ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తాం

**నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ స్వీకారం చుట్టింది. ఇక నుంచి భార తీయ జనతా పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నారు. దీనిపై శుక్రవారం ఏపీఎస్ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మీ



సమస్య మా బాధ్యతగా గుర్తించి, రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధి– బీజేపీ జనతా వారధి పేరుతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. తొలుత బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు బీజేపీ జనతా వారధిలో ఒక కమిటీ ఏర్పాటు చేసి, కమిటీ సభ్యులు, నాయకులు సంయుక్తంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అలాగే విశ్వకర్మ యోజన ద్వారా ప్రజలకు ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా అధ్యక్షులు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజల నుంచి వారి సమస్యలపై వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డం విజయ కుమార్, అంచిపాకు కమల, సుభాషిణి, రాజేష్, మాల్యాద్రి, ఫణిరాజు, రత్నం నాయుడు, పరుశురాం, సుజన పాల్గొన్నారు.

## 9న పికెపాడు ఎర్రచెరువు వేలంపాట

**అనంతసాగరం , ఫిబ్రవరి6,ప్రభాతవార్త:** మండలంలోని పడమటి కంభంపాడు లోని ఎర్రచెరువుకు వేలంపాట నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ కత్తి లావణ్య పెంచలయ్య, కార్యదర్శి పుల్లయ్య శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 9న ఎర్రచెరువుకు ఫసలికాలం 1435కుగాను బహిరంగ వేలంపాట నిర్వ హిసున్నామని పాటలో పాల్గొనేవారు పదివేల రూపాయలు చెల్లించి పాల్గొనాలన్నారు.షరతుల ప్రకారం పాడుకున్న వారు వేలంపాటలో సగం నగదు చెల్లించాలని వారు తెలిపారు.



## రాజ్యాంగ బద్ధంగా నూతన మేయర్ ఎన్నిక జరపాలి

- గిరిజన హక్కులను కాలరాసే హక్కు ఎవరు ఇచ్చారు
- 7వ రోజుకు చేరిన గిరిజన సంఘ ఐక్యవేదిక రిలే నిరాహార దీక్షలు
- మద్దతు పలికిన రైతు సంఘం, బి.ఎస్.పి,ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంఘాల ఐక్యవేదిక



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాల రాసే హక్కు ఎవరిచ్చారని వివిధ ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. తక్షణం రాజ్యాంగబద్ధంగా నూతన మేయర్ ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘ ఐక్యవేదిక చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గిరిజన సంఘానికి వేదికకు రైతు సంఘం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్య వేదిక, బి ఎస్ పి పార్టీల నాయకులు మద్దతు పలికాయి. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంగపట్నం రమణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అణగారిన వర్గాలను అణిచివేడివే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ముఖ్యంగా నెల్లూరు మేయర్ పదవి గిరిజన మహిళకు రాజ్యాంగబద్ధంగా కల్పిస్తే, దీనిని చూసి ఓర్వలేక జిల్లా నాయకులు మరో కులానికి చెందిన వ్యక్తికి ఇన్చార్జి బాధ్యతలు అప్పగించటం బాధాకరమన్నారు. ఇదేనా బడుగు బలహీన వర్గాలకు ఇచ్చే గౌరవం అంటూ ఆయన ప్రశ్నించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నాసిన భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ గత మేయర్ పై అవిశ్వాస తీర్మానం పెట్టి రెండు నెలలు కావస్తున్న ఇంతవరకు నూతన మేయర్ ఎన్నికలకు నోటిఫికేషన్ రాకపోవడం శోచనీయం అన్నారు. విశాఖపట్నంలో ఒక న్యాయం నెల్లూరులో ఒక న్యాయమా అంటూ ఆయన మండిపడ్డారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ కూడా స్పందించి వెంటనే నూతన మేయర్ ఎన్నికపై నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గంగపట్నం రమణయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిన్న భాస్కర్ గౌడ్ బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఎల్వి సుబ్బయ్య ఏపీ ప్రజా ఎస్సీ, ఎస్టీ, ఓసి, బిసి మైనారిటీ కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎడ్ల రవి యానాది మహానాడు స్టేట్ నాయకులు బత్తెన, లక్ష్మణ, శేఖర్, ఏడుకొండలు చౌదరి, శ్రీనివాసులు శివకృష్ణ వెంకటయ్య తలారి కోవూరు సురేష్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉదయగిరి కొండపై ఆవు కళేబరాలు

**ఉదయగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి అటవీ ప్రాంతంలో కొన్ని నెల లుగా పెద్దపులి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తు ంది. ఇప్పటికే పోలీసు, అటవీశాఖ అధికారులు ప్రజ లను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఉదయగిరి దుర్గంపై ఆవు కళేబరాలు స్థానిక ప్రజల్లో కలవరం పుట్టిస్తున్నాయి. ఆవును చంపింది పెద్దపులినా లేక చిరుత పులిన లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో ఆ శాఖ అధికారులు



సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. ఆవు కళేబరాలకు కారణం పూర్తి సమాచారం ఇంకా తెలియాలిన సుంది. ఏది ఏమైనప్పటికి ఉదయగిరి అటవీ ప్రాంతంలో పెద్దపులి ప్రజల్లో కలవరం పుట్టిస్తుందని చెప్పుకోక తప్పదు. ఇప్పటికే పులి రాప్ కెమెరాలలో కదలికలు నమోదు అయి ఉన్నాయి. కోన కాలువ తదితర ప్రాంతాలలో కూబింగ్ అటవీశాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. ఏదీ ఏమైనప్పటికి ప్రజలు కొండ కింద ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పెద్దపులి నుండి ప్రజలకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## మల్లికార్జునపురం గిరిజన కాలనీలో సేవా కార్యక్రమం

**తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** డిప్యూటీ ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు, ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు తోటపల్లి గూడూరు మండలంలోని మల్లికార్జునపురం గిరిజన కాలనీని సందర్శించారు.



అక్కడి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ఉన్న 70 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు, స్లేట్లు పంపిణీ చేశారు. సర్వేపల్లి నియోజకవర్గం జిల్లాలో గిరిజనులు ఎక్కువగా నివసించే నియోజకవర్గంగా ఉండగా, మల్లికార్జునపురం గిరిజన కాలనీని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దత్తత తీసుకొని తాగునీరు, సిమెంట్ రోడ్లు, నిత్యావసరాలు అందించడం అభినందనీయమని నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పేద గిరిజన కాలనీల అభివృద్ధి సాధ్యమవుతుందని, మాటలకంటే చేతలతోనే పాలన సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మనుబోలు మండల ప్రధాన కార్యదర్శి శివరాత్రి సందీప్, తోటపల్లి గూడూరు మండలం మహిళా నాయకురాలు వంగిపూడి సుధా, పల్లం రాజేష్, పర్వత సుబ్రహ్మణ్యం, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తాళ్లూరు జీవరత్నం, దేవి ప్రసాద్, మహేష్, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సర్వేలను వేగవంతం చేయండి

**సీతారామపురం ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** ప్రభుత్వ పథకాలు అమలులో భాగంగా ప్రభుత్వం నిర్వ హి స్తున్న సర్వేలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆత్మకూరు డివిజ నల్ డవల ప్మె ంట్ అధికారి రమణయ్య పేర్కొ న్నారు.శుక్రవారం సీతారామపురం మండ లంలో ని అయ్యవారిపల్లి బాలాయపల్లి, సింగారెడ్డి పల్లి, బసినేనిపల్లి, సచివాల యాలలో ఆకస్మికంగా తనీ ఖీ చేశారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వం నిర్ణయించిన యూనిఫైడ్ ప్యామీలి సర్వే అక్ష రాంధ్ర మరియు సిటి జన్ ఇకెవైసి సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఒ చంద్రశేఖర్ డిప్యూటి ఎంపిడిఒశివ ప్రసాద్‌రావు, జూనియర్ అసిస్టెంట్ భరత్ మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రామ వనరుల వ్యక్తుల ఎంపిక ప్రక్రియ విజయవంతం

**తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** టిపీ గూడూరు మండల పరిషత్ కార్యాలయం (ఎంపీడీఓ ఆఫీస్)లో గ్రామ వనరుల వ్యక్తుల ఎంపిక కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి సామాజిక తనిఖీ సంస్థ డైరెక్టర్ జి. శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై, అభ్యర్థులకు నిర్వహి ంచిన పరీక్షలు,ఇంటర్వ్యూలను పర్యవేక్షించారు. సామాజిక



తనిఖీ జవాబుదారీతనం, పారదర్శకత సంస్థ ఆధ్వ ర్యంలో పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచనల మేరకు ఈ ఎంపిక ప్రక్రియను చేపట్టారు. గ్రామ స్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహణ కోసం మొత్తం 81 మంది యువతీ, యువకులకు రాత పరీక్షలు నిర్వహించి, అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జి. శ్రీకాంత్‌కు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలలో పారదర్శకత, ప్రజా భాగస్వామ్యం పెంపొందించడమే లక్ష్య ంగా గ్రామ వనరుల వ్యక్తుల ఎంపిక జరుగుతుందని అధికారులు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతా వరణంలో సక్రమంగా నిర్వహించడంతో అభ్యర్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ రాష్ట్రస్థాయి సిబ్బంది పాల్గొని, ఎంపిక ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించారు.

## కోనేరు గుంట దేవదాయ శాఖలో చేరుస్తారా.?

**కొడవలూరు,ఫిబ్రవరి6ప్రభాతవార్త:** మండల కేంద్రం లో ఉన్న శివాలయంలో ప్రతి ఏడాది అంగరంగ వైభవ ంగా బ్రహ్మోత్సవాలు, నిత్య పూజలు జరు గుతా యి. అలాగే కార్తీక మాసంలో భక్తులు వివిధ రకాల స్వామి మాలధారాలు ధరించి పూజలు జరుప ుకుం టారు. పరిసర ప్రాంతాల నుండి ఎంతోమంది భక్తులు శివాల



యంకు చేరుకుని వారి మొక్కలు తీర్చుకు ంటారు. అయితే ఆలయ ఆవరణంలో ఉన్న కోనేరు గుంట, స్వామివారి ఉత్సవాలకు, భక్తులకు ఎలాంటి ఉపయోగానికి నోచుకోవటం లేదు. ఈ కోనేరు గుంట గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉండడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదని ప్రజానికం పేర్కొన్నారు.ఇకనైనా పరిపాలకులు,అధికారులు మత్తు నిద్రలో నుంచి లేచి దేవస్థానంకు అవసరమయ్యే కోనేరు గుంటను దేవదాయ శాఖలో చేర్చి దేవస్థానాన్ని అభివృద్ధి పరచాలని స్థానికులు కోరుకుంటున్నారు.

## బీజేపీలో ఉదయగిరి వాసికి జిల్లా పదవి

**ఉదయగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** నెల్లూరు పార్ల మెంట్ బీజేపీ అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు పి.సురేందర్‌రెడ్డి చేతుల మీదుగా మన్నేటి శ్రీనివాసులురెడ్డికి జిల్లా బీజేపీ కార్యవర్గంలో స్థానం కల్పి ంచినట్లు తెలియజేశారు. ఈ గురుత్తర బాధ్యతను తనపై నమ్మకం ఉంచిన బీజేపీ సీనియర్ లీడర్లందరికి ధన్య వాదాలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో బీజేపీని మరింత బలోపేతం పక్రియతను రాబోవు స్థానిక సంస్థల ఎలక్షన్లో బీజేపీని గెలిపించడం కోసం తన శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.



## గండిపాలెం హైస్కూల్ నందు ఉపాధ్యాయుడిని కాపాడిన విద్యార్థి

**ఉదయగిరి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని సమయానుకూలంగా వెంకట కిరణ్ సిద్దార్ధ్ ప్రతిభ అభినందనీయమని ఆర్.రవీంద్ర హెడ్‌మాస్టర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గండిపాలెంలో శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గండిపాలెం నందు పదవ తరగతి చదువుతున్న విద్యార్థి కంచర్ల వెంకట కిరణ్ సిదార్ధ అనే విద్యార్థి అదే పాఠ శాలలో పని చేసే కేసి మాలకొండయ్య తెలుగు ఉపాధ్యాయులు, అకస్మా త్తుగా కళ్ళు తిరిగి పాఠశాలలో స్పృహతప్పారు. ఇంతలోనే సిదార్ధ ఉపాధ్యా యుడు యొక్క పరిస్థితిని గమనించి, గుండె సంబంధిత వ్యాధులకు చేసే సీపీఆర్ అత్యవసర ప్రాణ రక్షణ పక్రియను చేసి, ఉపాధ్యాయులు కోల్కొనే విధంగా చేశారు. ఇంతలో మెరుగైన చికిత్స నిమిత్తం ఉదయగిరికి పంపారు.



పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ కనపరిచిన ప్రతిభకు సురేష్, వెంగళరావు నారాయణరావు అభినందించారు. ఈ విధంగా విద్యార్థులంరూ కూడా ఎయిడ్ చేసే పక్రియలలో అన్ని విధాలుగా అన్ని పక్రియలు తెలుసుకుని ఉండాలని తెలిపారు.

## చేనేతల డిమాండ్లు సాధనకై చేనేత గర్జన జయప్రదం చేయండి

**మనుబోలు ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** మంగళ గిరిలో ఈనెల22 న రాష్ట్ర వ్యాప్తంగా చేనేత మరియు సహకార సంఘాల ఆధ్వర్యంలో జర గబోయే చేనేత మహా గర్జనను జయప్రదం చేయాలని ఆ సంఘాల నాయకులు మండ లం లోని మనుబోలు మడమనూరు గ్రామాలలో శుక్రవారం నేతన్నల సమక్షంలో కరపత్రాలను



ఆవిష్కరించి అందరికి అందజేశారు. చేనేతకు న్యాయమైన డిమాండ్లు సాధనకై ప్రతి ఒక్కరు పాల్గోని కదలిరావాలన్నారు.గత ప్రభుత్వం చేస్తున్న నేతన్న నేస్తం 24 వేలు రూపాయాలు పథకాన్ని ఈ కూటమి ప్రభుత్వం 25 వేలకు పెంచి ఇస్తానని ఇప్పటి వరకు అది కార్యాచరణకు నోచుకోలేదని 50 ఏళ్ళకే పెన్షన్ సౌకర్యం ప్రతి ఇంటికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇప్పటి వరకు ఇవ్వలేదని చేనేత వస్త్ర ఉత్పత్తికి ఉపయోగించే ముడి సరుకులపై విధించిన జీఎస్‌టిని రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్ర మంలో కటికాల వెంకటేశ్వర్లు, పముజుల శంకరయ్య, సుబ్రహ్మణ్యం ,హరి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, వెంకట శేషయ్య, వెంకట కృష్ణయ్య శ్రీహరి, తదితర చేనేత సంఘాల నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీతలకు యుటిఎఫ్ ఘనసన్మానం

**మర్రిపాడు, ఫిబ్రవరి6,ప్రభాతవార్త:** గణతంత్ర దినోత్స వం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ సేవా పురస్కారం పొందిన మర్రిపాడు మండల విద్యాశాఖ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ జి.శ్రీని వాసులు, సిఆర్.ఎం.టి.కస్తూరయ్యలను యుటిఎఫ్ మర్రిపాడు మండలశాఖ అధ్యక్షుడు విజయ భాస్క



ర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ ఘనంగా సన్మానించి అభిన ందించారు. ఈసందర్భంగా మర్రిపాడు ఎంఇఒలు తిరుపతయ్య, ధనలక్ష్మిలు మాట్లాడుతూ వృత్తిపట్ల వారికి ఉన్న నిబద్ధత, వారి ఉత్తమ సేవలను గురించి కొనియాడారు.ఈకార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, సీనియర్ నాయకులు హెచ్.మోహన్‌ప్రసాద్, సాంబశివారెడ్డి, సుబ్బరాయుడు, మారుతి, , కేశవరెడ్డి, యుటిఎఫ్ నాయకులు చంద్రమోహన్, గురుస్వామి, బాలగురవయ్య, ఎన్. వెంకటే శ్వర్లు , రఫీచాంద్‌బాషా, వెంకటరెడ్డి , దొంతురత్నయ్య, సురేష్ ,పీర్ అహ్మద్, సంపూర్ణమ్మ, విజయలక్ష్మి, అనిత, లక్ష్మి, ఉపాధ్యాయులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు పంట క్యూరింగ్‌ను పరిశీలించిన పొగాకు బోర్డు ప్రతినిధులు

**మర్రిపాడు,ఫిబ్రవరి6,ప్రభాతవార్త:** మర్రిపాడు మండ లంలోని డిసిపల్లి పొగాకు బోర్డు పరిధిలోని గుండెవ డకల , భైరవరం , తురకపల్లి, జంగాలపల్లి, గండ్లవీ డు, డిసిపల్లి గ్రామాలను పొగాకు బోర్డు, పొగాకు కంపెనీ ప్రతినిధులతో కూడిన రైతు మిత్ర బృందం శుక్రవారం పొగాకు పంటను, పొగాకు క్యూరింగ్‌ను పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు వేలం నిర్వహ ణాధికారి



జి.రాజశేఖర్, ఎం.సత్యశ్రీనివాసరావు, ఎస్‌జిఒ ఫీల్డ్ ఆఫీసర్ ఆదర్శ్, ఐటిసి ప్రతినిధి వెంకట్రావు, జిపిఐ ప్రతినిధి శ్రీనివాసరావు, పిఎస్ఎస్ ప్రతినిధి రామాంజనేయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పొగాకు ఎక్కువగా పండించడం జరిగిందని, మన రాష్ట్రమంతా పొగాకు సాగు డిమాండుకన్నా ఎక్కువగా పెరిగిందని, దీనివలన ధరలు ఆశించినంత లేకపోవచ్చన్నారు. కావున ఇప్పటికీ కూడా పొగాకు నాటాలనుకునే రైతులు మానుకోవాలన్నారు. ఇప్పుడు నాటే పొగాకు నాణ్యత రాదని, నాణ్యతలేని పొగాకును పండించడం వలన నష్టాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. రైతులు మంచి నాణ్యత ఉన్న పొగాకు ను పండించాలన్నారు. డిసెంబరు లోపు నాట్లు వేయడం, నత్రజని కి సంబంధించిన ఎరువులు మోతాదుకు మించి వేయకపోవడం,పొటాష్‌కు సంబంధించిన ఎరువులు తప్పనిసరిగా వేయాలన్నారు.అంతర సేద్యాలు చేయడం,మంచి పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే రేల్చడం చేయాల న్నారు.పడిపోయిన ఆకులను వదిలేయాలని, బ్యారన్లలో వెయ్యి కర్రల లోపు పెట్టి ఓవర్ లోడ్ కాకుండా చూడాలన్నారు. మండెలు చిన్నవిగా వేసుకోవాలన్నారు.పొగాకును కింద వేయకుండా తార్పల్ పట్టలు పైన వేయడం వంటి పద్ధతులు పాటిస్తే మంచి నాణ్యమైన పొగాకును పండించవచ్చని తెలిపారు. కొన్ని పొలాల్లో పొగాకు మల్లె ఉందని దీనికి వచ్చే పంట కాలంలో పొగాకు వేయకుండా నువ్వు వంటి పంటలతో పంట మార్పిడి చేయాలని లేకుంటే పొగాకు మల్లిని నియంత్రించలేమన్నారు. ఈకార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

**నెల్లూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త –వైద్యం :** 33/11 కేవీ రాజేంద్రనగర్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా గుప్తా పార్క్, ములుమూడి బస్టాండ్, అగ్నిపేట, చిన్న బజార్, జ్ఞానమ్మ తోట, సంతపేట, రామిరెడ్డి వీధి పరిసర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.శ్రీధర్ తెలియజేశారు.

## యువత భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించుకొని పట్టుదలతో సాధించాలి

**నెల్లూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త–విద్య :** యువజన సర్వీసులు శాఖ(సెట్నెల్) కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బుజబుజ నెల్లూరులోని డీవీఎస్ఎం జిల్లా పరిషత్ ఉన్నత



పాఠశాల, శేషు ఇంగ్లీషన మీడియం హైస్కూల్ నందు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అండ్ క్యారియర్ కౌన్సి లింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ పి.సురేష్‌బాబు పాల్గొని మాట్లాడుతూ యువత తమ భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించుకుని వాటిని సాధించేందుకు గాను 21 రోజుల పాటు వారు ఎంచుకున్న లక్ష్యాన్ని పేపర్ పై రాసి పదే పదే స్మరిం చుకుంటే వారు అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా సాధించగలరని తెలియజేశారు. అనంతరం సెట్నెల్, సీఈఓ ఏ.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కెరీర్‌ను సాధించాలంటే కృషి, పట్టుదలతో పాటు వారికి ఇష్టమైన రంగాలను ఎంపిక చేసుకుని ఒక ప్రణాళికబద్ధంగా ప్రయత్నిస్తే లక్ష్యాన్ని సాధించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేషు స్కూల్ కరస్పాండెంట్ ఆదిశేషు, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు హజరత్తయ్య, సెట్నెల్ మేనేజర్ శ్రీనివాసులు,సూపరింటెండెంట్ గయాజ్ అహ్మద్,జిల్లా పీహెచ్‌పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్,దేవరకొండశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## లెప్రసీ వ్యాధిపై అవగాహన అవసరం

– డాక్టర్ ఎస్‌కే ఖాదర్ వలి



**నెల్లూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త –వైద్యం :** కుష్టు రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్ వలి పిలుపునిచ్చారు. నెల్లూరులోని రామ్మూర్తి నగర్ ఎంసీహెచ్ఎస్ పాఠశాలలో ఎస్‌కే ఖాదర్ వలీ, స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లెప్రసీ వ్యాధి ఎలా వస్తుంది, దాని లక్షణాలు ఏమిటి, వ్యాధి నివారణకు మార్గాలను విద్యా ర్థులు తెలుసుకోవాలన్నారు. ఈ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న చికిత్స విధానాన్ని తెలుసు కోవాల ని సూచించారు. అలాగే సమాజంలో ఈ వ్యాధి సోకిన వారి పట్ల వివక్షత చూపడం సరికాదని తెలి పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ శివరాం ప్రసాద్, పీసీ నాయుడు స్ట్రీట్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, డీపీఎంఓ డాక్టర్ సుబ్బయ్య, కరుణమ్మ, మంజుల ఆరోగ్య కార్యకర్తలు , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జెఆర్ఆర్ ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపిన ఎంఈఓలు



**అల్లూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** అల్లూరు మండలంలోని ఉన్నత పాఠశాలలకు మరియు యూపి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర జెఆర్ఆర్ ట్రస్టు ద్వారా 724సైకిళ్ళు విద్యార్థులకు పంపిణీ చేసినందుకు అల్లూరు మండల విద్యాశాఖ అధికారులు కృతజ్ఞ తలు తెలిపారు. నార్త్ మోపూరులో 223, ఈస్ట్ గోగులపల్లెలో 71, ఆర్కేజేసి 163, యూపిస్కూల్ 93, సుబ్బయ్యబడిలో 174మంది విద్యార్థులకు పాఠశాలలకు క్రమం తప్పకుండా వచ్చి ఉన్నత విద్యను అభ్యసించేందుకు సైకిలు పంపిణీ చేసినందుకు ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు మండల విద్యాశాఖ తరపున ఎంఈఓలు కృతజ్ఞతలు తెలిపారు.

## రహదారి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**కావలి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో జరుగుతున్న జాతీయ రహదారి పనులను మున్సిపల్ అధికారులు, హైవే అధికారులతో కలసి ఎమెల్యే వెంకటక్రిష్ణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోకి వచ్చే జాతీయ రహదారి ఇరుపక్కల డ్రైనేజి, పుట్‌పాత్‌లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షపునీరు ఎకకడా నిలబడకుడా సజావుగా వెళ్ళేలా రోడ్డు నిర్మాణం చేపట్టాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, డిఈ సాయిరాం, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో సత్తా చాటిన లుంబిని విద్యార్థులు




**చేజర్ల ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా స్థాయిలో శుక్ర వారం నిర్వహించిన అబాకస్ జూనియర్ లెవల్ పోటీల్లో చేజర్లకు చెందిన లుంబినీ విద్యా లయం విద్యార్థులు ప్రతిభను చాటుకు న్నారు. ఈ పోటీల్లో లుంబని విద్యా ర్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల ను కైవశం చేసుకొని పాఠశాలకే కాకుండా మండలానికి గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీల్లో లుంబినీ విద్యాలయానికి చెందిన షేక్ ఫతీన్ ( 4 వ తరగతి ) అద్భుత ప్రతిభతో ప్రథమస్థానాన్ని సాధించాడు. అలాగే ద్వితీయ స్థానాలను బి. చరణ్ తేజా ( 5 వ తరగతి, జి. చందు ( 3 వ తరగతి ), కె. భవిజ్ఞ (2వ తరగతి) సాధించి తమ ప్రతిభను నిరూపించారు. తక్కువ వయస్సులోనే గణిత నైపుణ్యాలను పెంపొందించే అబాకస్ విద్యలో విద్యార్థులు ఈ స్థాయిలో విజయాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల విజయం వెనుక ఉపాధ్యాయుల కృషి, పాఠశాల యాజమాన్యం అందిస్తున్న నాణ్యమైన శిక్షణ కీలకంగా నిలిచిందని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా లుంబినీ విద్యాలయ యాజమాన్యం, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విజేతలైన విద్యార్థులను ఘనంగా అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోను ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## పేదల పట్ల వేమిరెడ్డికి మమకారం




**వింజమూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** వీపీఆర్ ఫౌండేషన్ అధినేత నెల్లూరు పార్లమెంట్ సభ్యులు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు పేదల పట్ల వారు చూపుతున్న ప్రేమాభిమానాలు మరువ లేనివని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని చంద్రపడియ గ్రామంలో ఏర్పాటు చేసిన వీపీఆర్ నేత్ర కంటి వైద్య శిబిరంను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సాగునీటి సంఘ అధ్యక్షులు వేమూరి దొరస్వామి నాయుడు, తెలుగుదేశం పార్టీ మండల కో క్లస్టర్ ఇన్‌చార్జి పాములపాటి మాల్యాద్రి, వీపీఆర్ నేత్ర విజయవంతం చేసేందుకు ముందుగా గ్రామంలో ప్రచారం నిర్వహించి ఈ ఉచిత వైద్య శిబిరంను అధిక సంఖ్యలో ప్రజలు వినియోగించుకునే విధంగా కృషి చేశారన్నారు. వేమిరెడ్డి దంపతులు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో ప్రయోజనకరంగా ఉపయోగపడుతున్నాయి ఎంతో మందికి నడవలేని వారికి ట్రైసైకిళ్లను అందజేసి వారికి మరో జన్మను ప్రసాదించే విధంగా సేవ చేశారన్నారు. ప్రస్తుతం జిల్లాలోని జిల్లాలోని మొట్టమొదటిగా ఉదయగిరి నియోజకవర్గంలో అత్యంత వెనుకబడిన పేదలు ఉంటారని భావించి ఈ ప్రాంతంలో వీపీఆర్ నేత్ర పేరుతో కంటి వెలుగును ప్రసాదించే కార్యక్రమం శ్రీకారం చుట్టడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న పుణ్యమే అని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరెన్నో చేసే విధంగా వేమిరెడ్డి దంపతులు భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరారు. శిబిరానికి విచ్చేసిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, సొసైటీ డైరెక్టర్ కోడూరు నాగిరెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కంచర్ల శ్రీనివాసులు, దాట్ల శ్రీనాథ్‌రెడ్డి, తిరుపతిఆచారి, కృష్ణయ్య, ఏగినేని శ్రీనివాసులు, ఏన్నపల్లి పెంచలరావు, ఖాదర్ భాషా తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేచే శివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**పొదలకూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** పొదలకూరు పట్టణంలోని చోళుల కాలం నాటి పురాతన శివాలయంలో ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. శుక్రవారం సర్వే పల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తన నివాసంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ స్వామి, టిడిపి నాయకులు తల చీరు మస్తాన్ బాబు, బొద్దులూరు మల్లిఖార్జున్ నాయుడు, బక్కయ్య నాయుడు, కోడూరు పెంచల భాస్కర్ రెడ్డిలు, ఆలయ అధికారులతో కలిసి కరపత్రాలును ఆవిష్కరణ చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, వాహన సేవలు, ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ప్రసాద్ రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలు భాగంగా 14న అంకురార్పణతో ప్రారంభమవుతాయి. అదే రోజు ఉదయం స్వామివారికి కోడూరు శ్రీనివాసుల సహకారంతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 15న రాత్రి 12 గంటలకు సంప్రదాయబద్ధంగా స్వామివారి నందివాహన సేవ నిర్వహించనున్నారు. 16వ తేదీ (సోమవారం) ఉదయం గజవాహన సేవ జరగనుంది. 17వ తేదీ (మంగళవారం)న కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. 18వ తేదీ (బుధవారం)న అలకలతోపు కార్యక్రమం జరుగుతుంది. 19వ తేదీ (గురువారం)న ధ్వజావరోహణతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీతో పాటు ప్రత్యేక అలంకార సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికా రులు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మరియు సాయంత్రం 7 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృప పొందాలని ఆలయ అధికారులు, కూటమి నాయకులు కోరారు.

## ఎంపిడిఒ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జడ్పీ సిఇఒ



**అనంతసాగరం, ఫిబ్రవరి6, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన అనంతసాగరం లోని మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా ముఖ్య నిర్వహణాధికారి ఎల్. శ్రీధర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే , అక్షర ఆంధ్ర కార్యక్రమం నమోదు గురించి ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వేలనఉ పూర్తిస్థాయిలో త్వరితగతిన పూర్తిచే యాల న్నారు. అనంతరం కార్యాలయ రికార్డులను , రికార్డు రూము నిర్వహణను తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపిపి పెయ్యల సంపూర్ణ , ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విజ్‌డమ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎంపికైన కంపసముద్రం వాసి



**మర్రిపాడు , ఫిబ్రవరి6, ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం కంపసముద్రం గ్రామానికి చెందిన మున్నెల్లి శివశంకరయ్య అమెరికన్ విజ్‌డమ్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఈయన అనంతసాగరం మండలం చిలకలమర్రి ఉన్నతపాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. దారంతో వివిధ దేవతా ప్రతిమలు, జాతీయనాయకుల ప్రతిమలు ఎంతో కళాత్మకంగా తయారు చేసినందుకు గాను వారిని ఈ అవార్డ్‌కు ఎంపిక చేసినట్లు సంస్థ ప్రతినిధులు మెయిల్ ద్వారా తెలిపారు. ఈనెల 28న తమిళనాడులోని హోసూరులో వారికి ఈ అవార్డును అందజేస్తారని వారు తెలిపారు.

## 26 నుంచి కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**బిట్రగుంట ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** బోగోలు మండలం కొండ బిట్రగుంట లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 26వ తేదీ నుండి ప్రారంభం కాను న్నాయి. ఈఏడాది శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానంలో మాదిరిగా 11 రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాటు చేసేందుకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు



సమన్వయం చేసుకుంటూ నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది జరిగే బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుండి లక్షలాదిమంది భక్తులు విచ్చేసి శ్రీ స్వామి వారి సేవలను తిలకిస్తూ ఉంటారు. బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో కొండ బిట్రగుంట, పాత బిట్రగుంట గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొని ఉంటుంది. ఈ ఏడాది జరిగే బ్రహ్మోత్సవాల్లో కొన్ని కొత్తగా స్వామివారికి వాహన సేవలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై వారం పది రోజుల్లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కావలి ఆర్డీవో వంశీకృష్ణ అధ్యక్షతన అన్ని శాఖల అధికారుల తో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకునే చర్యలపై చర్చించనున్నారు. ఈనెల 26వ తేదీ నుండి జరిగే బ్రహ్మోత్సవాల గురించి ఆలయ కార్యనిర్వాహణాధికారి అరవ రాధాకృష్ణ "ప్రభాతవార్త"కు వివరాలు26న ఉదయం గిరి ప్రదక్షి ణ, రాత్రికి అంకురారోపణ, 27న ఉదయం తిరుమంజనం రాత్రికి ధ్వాజరోహణ, శేష వాహనము, 28న ఉదయం చందనాలంకారం రాత్రికి హనుమవాహం, మార్చి 1న ఉదయం మోహిని ఉత్సవం రాత్రికి గరుడ సేవ, 2న ఉదయం మొక్కుబడులు రాత్రికి గజవాహనం, 3న రాత్రికి కళ్యాణోత్సవం, 4న ఉదయం రథోత్సవం రాత్రి తెప్పోత్సవం ,5న ఉదయం సూర్యప్రభ వాహనం చంద్ర వాహనం,6న ఉదయం కల్పవృక్ష వాహనం రాత్రికి ఆస్వా వాహనం,7న ఉదయం చక్రస్థానం రాత్రికి ధ్వజ అవరోహణం,8న ఉదయం పుష్ప వాహనం రాత్రికి ఏకాంత సేవ తెలియజేశారు .బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజా రవాణా శాఖ ప్రత్యేక సర్వీసులు కూడా నడపనున్నది. నారద మహర్షి చేత ప్రతిష్ఠించబడిన శ్రీ ప్రసన్నుడని దర్శించుకుని కోరిన కోర్కెలు వెంటనే తీరుస్తారని ఈ ప్రాంత వాసుల ప్రగాఢ విశ్వాసం. బ్రహ్మోత్సవాలకు సుదూర ప్రాంతాల నుండి వచ్చేటువంటి భక్తుల కోసం ఆయా సామాజిక వర్గాల అన్నదాన సత్రాలలో ఉచిత వసతి భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నారు. మరో రెండో తిరుమల గా ప్రసిద్ధిగాంచిన కొండ బిట్రగుంట ప్రసన్నుడు ఉత్సవాలను కనులారా వీక్షి ంచేందుకు ఈఏడాది ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేపడుతున్నారు.

## బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులుగా అల్లంపాటి రంగారెడ్డి



చేజర్ల ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : చేజర్ల మండలం మామూడూరు గ్రామానికి చెందిన అల్లంపాటి రంగారెడ్డినిభారతీయ జనతాపార్టీ నెల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ మేరకు జిల్లా బిజెపి అధ్యక్షులు వంశీదర్‌రెడ్డి శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు చేశారు. పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తు క్షేత్రస్థాయి కార్యకర్తలను సమన్వయం చేయడంలో అల్లంపాటి రంగారెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని జిల్లా నాయకత్వం ప్రశంసించింది. పార్టీ సిద్దాంతాలు, కార్యక్రమాలను ప్రజలోకి మరింత బలంగా తీసుకెల్లేందుకు ఆయన సేవలు ఉపయోగ పడుతాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నియామకంపై అల్లంపాటి రంగారెడ్డిని పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు అభినందించారు. తనపై ఉంచిన భాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తు పార్టీ అభివృద్ధికి ప్రజా సమస్యలపరిష్కారానికి కృషి చేస్తానని అల్లంపాటి రంగారెడ్డి తెలిపారు.

## నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



**ముత్తుకూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మండలంలోని కృష్ణపట్నం గ్రామ పంచాయితీలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శుక్ర వారం ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆదేశాలతో మండల తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ ఆధ్వ ర్యంలో స్థల పరిశీలన చేసారు. ఈ సందర్భంగా తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సోమిరెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోహన్ బాబు, విష్ణులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి




**గూడూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** విద్యార్థి సంఘ నేతలను కిడ్నాప్ చేసి నిర్బందించిన సినీ నటులు మంచు మోహన్ బాబు, విష్ణులపై కేసు నమోదు చేయాలని, సి.పి.ఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివ కుమార్‌లు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద వామ పక్ష నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అడిగినందుకు, తిరుపతి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్యూఐ నాయకులను బౌంసర్లు కిడ్నాప్ చేసి మోహన్ బాబు ఫామ్ హౌస్‌లో నిర్బందించడం దుర్మార్గమైన చర్య అన్నారు. గత ఏడాది విద్యార్థుల తల్లిదండ్రుల నుండి 27 కోట్ల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. ఈ ఏడాది కూడా అలాగే వసూలు చేస్తారని, కలెక్షన్ కింగ్ వసూళ్లను నిలువరించాలని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో కేసులు, సమస్యలు ఉన్న మోహన్ బాబు కళాశాల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేసి, ప్రభుత్వం ఎం.బి.యును అధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు ఎంబేటి చంద్రయ్య, అడపాల ప్రసాద్, పామంజి మణి, సీపీఐ నాయకులు శశి కుమార్, సునీల్, గోపాలయ్య, మీరా సాహెబ్, రాజ తదితరులు పాల్గొన్నారు.

## ఇంట్లో చోరీబంగారు అపహరణ



**గూడూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** గూడూరు పట్టణంలోని రాణి పేటకి చెందిన మునిరత్నం అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన చోటు చేసుకుంది. ఒకటవ పట్టణ పోలీస్‌ల కథనం మేరకు పనుల నిమిత్తం బం దువుల ఇంటికి వెళ్ళడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లో చోరీ జరిగిందన్నారు. 3 సవర్ల 3 గ్రాములు బంగారు చోరీ జరిగిందని బాదితుడు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## పొలాల గట్ల వద్దే పాసు పుస్తకాలు పంపిణీ



**కోవూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** రైతులకు పొలాల గట్ల వద్దే పాసు పుస్తకాలు పంపిణీ చేస్తూ నూతా సాంప్రదాయం కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గత ప్రభుత్వంలో పాసు పుస్తకాలు ఎటువంటి రాజముద్ర లేకుండా నేతల ఫొటోలతో పంపిణీ చేయడం జరిగిందని, అందుకు బిన్నంగా ప్రస్తుతం రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలు కూటమి ప్రభుత్వం రైతులకు అందజేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం జరిగిన ఈ పంపిణీ కార్యక్రమానికి రైతుల పొలాల వద్దే అధికారులు, నేతలు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బషీర్, మండల పార్టీ అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ రీ సర్వే తహసీల్దార్ మధుసూదన్‌రావు, కోవూరు మండల టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌కే సుభాన్, ఉప సర్పంచ్ చేజర్ల మోహన్, పార్టీ నాయకులు విజయ్, మునీంద్ర, వెంకటేశ్వర్లు, హజరత్, ఎస్‌కే ఖలీల్ , తదితరులు ఉన్నారు.

## విజ్ఞాన విహార యాత్రలకు బయలుదేరిన విద్యార్థినులు




**కోవూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇటువంటి విజ్ఞాన విహారయాత్రలు ఎంతగానో దోహదపడతాయని ప్రధానోపాధ్యాయురాలు సోఫియా కిరణ్మయి అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు 110 మంది రెండు బస్సులలో శుక్రవారం విజ్ఞాన విహారయాత్రకు శ్రీహరికోటకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. శ్రీహరికోట



షార్ కేంద్రంలో ఎన్నో అమూల్యమైన విజ్ఞాన పరమైన సాంకేతిక పరమైన అంశాలను అక్కడ ఉన్న అధికారులు తమ విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు. నేలపట్టులోని పక్షుల విడిది కేంద్రాలను కూడా విద్యార్థులు సందర్శించి పూర్తిస్థాయిలో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యాంజలి కీలకం ఏపీసీ వెంకటసుబ్బయ్య




**కోవూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాంజలి కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, సమాజం సమన్వయంతో విజయవంతం చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం కోవూరు మండలంలోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యాంజలి కార్యక్రమంనూ ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడేతూ సమాజంలోని విద్యావంతులు, రిటైర్డ్ అధికారులు, దాతలు పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావడమే విద్యాంజలి ముఖ్య ఉద్దేశమని ఏపీసీ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అదనపు నైపుణ్యాలను అందించేందుకు ఈ వేదికను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలలకు అవసరమైన సదుపాయాలు లేదా విద్యాపరమైన అవసరాలను విద్యాంజలి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా దాతల సహకారం పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జి. సుధీర్‌బాబు, ఏపీవో ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారులు రహీమ్, వై. చెంచులక్ష్మమ్మ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, డాక్టర్ సయ్యద్ జుల్ఫికర్ అలీ అహ్మద్, మమత, ట్రైనర్ ఖాదం బాషా, సీఆర్ఎంటీలు విష్ణు ప్రసాద్, వనజ, ఉషా, హేమలత, హరీష్, వెంకటరమణమ్మ, శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.